సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం ◊ 26 ◊ జనవరి ◊ 2024

I



ఓటు హక్కు వినియోగమే..

జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీనియర్లను సత్కరించారు.

- IIలో



ఉద్యోగ కల్పనపై దృష్టి

జీఆర్‌ఏయూ కొత్త ఎంఓయూ కుదుర్చుకుంది. ఐటీ సంబంధిత విభాగం బలోపేతం కానుంది.

- IIలో

రిపబ్లిక్ డే పరేడ్‌లో వర్సిటీ విద్యార్థిని



ఎచ్చెర్ల క్యాంపస్: దేశ రాజధాని న్యూఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌లో జీఆర్‌ఏయూ విద్యార్థిని బమ్మిడి రంజని పాల్గొనున్నారు. రాష్ట్రస్థాయిలో జాతీయ సేవాపథకం వలంటీర్లు పది మందిని ఎంపిక చేయగా, అందులో ఈమె కూడా చోటు దక్కించుకున్నారు. విద్యార్థినిది నందిగాం మండలం ఆనందపురం. శిక్షణలో పాల్గొన్న రంజని గురువారం భారత పార్లమెంట్‌ను సైతం సందర్శించింది.

న్యూస్‌రీల్

29 నుంచి విద్యుత్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ

అరసవల్లి: జిల్లాలో ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఈఆర్సీ) 2024–25 నుంచి 2028–29 ఆర్థిక సంవత్సరాలకు గాను ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఈ నెల 29 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లుగా జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలియజేశారు. ఈ మేరకు విశాఖపట్నం తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. స్థానిక విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి 4.30 గంటల వరకు ఈ అభిప్రాయ సేకరణ జరుగుతుందని వివరించారు. దీనిపై ఎవరికైనా సందేహాలుంటే, సూచనలు చేయాలనుకుంటే ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చునని, ముందుగా 9440812387 నంబర్‌కు సంప్రదించి పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు.

అంబులెన్సులో ప్రసవం



అంబులెన్సులో ప్రసవించిన తల్లి,బిడ్డలతో ఈఎంటీ తారకేశ్వరరావు

కాశీబుగ్గ: మందస మండలం బుడారిసింగి గ్రామానికి చెందిన శివానిగౌడ్ (24) అనే గర్భిణిని అంబులెన్స్ సిబ్బంది అండగా నిలిచి ప్రసవం చేశారు. ఆమెకు గురువారం రాత్రి నొప్పులు వచ్చాయి. వెంటనే కుటుంబ సభ్యులు 108ను సంప్రదించారు. పలాస మండల 108 వాహనం గ్రామానికి చేరుకుని ఆమెను పలాస తీసుకువస్తుండగా కొండల దారుల్లో ఆమెకు నొప్పులు అధికమయ్యాయి. దీంతో స్పందించిన ఈఎంటీ బత్తిని తారకేశ్వరరావు పైలెట్ కె.శ్రీనివాసరావుకు సమాచారం అందించి వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి గర్భిణికి సపర్యలు చేశారు. దీంతో ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. తల్లీబిడ్డను క్షేమంగా ఆస్పత్రికి చేర్చారు. దీంతో ఈఎంటీని గణతంత్ర రోజున అందించే అవార్డుకు ఎంపిక చేశారు.

29,30 తేదీల్లో ఎన్‌వైవీల ఇంటర్వ్యూలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో ఈ నెల 29,30 తేదీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎన్‌వైవీ పోస్టుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎన్‌వైకే యూత్ ఆఫీసర్ కె.వెంకట్‌ఉజ్వల్ తెలిపారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ న్యూఢిల్లీ వారి ఆదేశాల మేరకు కలెక్టర్ సూచనల మేరకు 29వ తేదీన ఇచ్ఛాపురం, మందస, కాశీబుగ్గ, కొత్తూరు, కోటబొమ్మాళి, టెక్కలి బ్లాకులకు, అలాగే 30వ తేదీన నరసన్నపేట, సారవకోట, గార, ఆమదాలవలస, ఎస్‌ఎంపురం, రణస్థలం బ్లాకులకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆన్‌లైన్ దరఖాస్తు కాపీ, రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ గ్యారేజ్‌కు ఆనుకుని పాలకొండ రోడ్‌లో ఉన్న నెహ్రూ యువ కేంద్ర కార్యాలయం వద్దకు నిర్దేశిత తేదీలలో ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని వెంకట్ ఉజ్వల్ తెలిపారు.

ఎన్నికల శంఖారావానికి సంసిద్ధం

- భీమిలి బహిరంగ సభ విజయవంతం చేయండి
- వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర నాయకులు, ప్రజా ప్రతినిధులు ఎన్నికల శంఖారావానికి సంసిద్ధులు కావాలని పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 27న భీమిలి నియోజకవర్గంలోని సంగివలసలో నిర్వహించనున్న సభకు తరలిరావాలని కోరారు. ఈ సభలో పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాల్గొని నాయకులు, ప్రజాప్రతినిధులకు దిశా నిర్దేశం చేసి భీమిలి నుంచే ఎన్నికల శంఖారావానికి శ్రీకారం చుడతారన్నారు. శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన గురువారం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులకు మరోసారి తెలియజేసి వారిని ఉత్తేజితులను చేయడమే ఈ సభ ఉద్దేశమన్నారు. ఈ సభలో ఉత్తరాంధ్రలోని 34 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఐదు వేలు చొప్పున రెండు లక్షల మంది వరకు ప్రజాప్రతినిధులు, గృహ సారథులకు స్థానం కల్పించనున్నట్లు తెలిపారు. ఇలాంటి సభలే రాష్ట్ర వ్యాప్తంగా మరో నాలుగు చోట్ల నిర్వహిస్తామన్నారు.

సంక్షేమ పాలన అందించాం

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాకే రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా దళారీ వ్యవస్థకు చెక్ పెట్టి పారదర్శకంగా సంక్షేమ పాలన అందిస్తున్నాం కాబట్టే, ఓటు అడుగుతామని అన్నారు. ఉత్తరాంధ్రలో పార్టీ నాయకులు, నామినేటెడ్ పదవులు పొందినవారు, క్రియాశీలకంగా వ్యవహరించే వారు, వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. 175కి 175 స్థానాల్లో గెలిపించుకునేలా ప్రణాళిక సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. భీమిలి సభ చరిత్రలో నిలిచిపోయేలా చేయాలన్నారు.

అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ సీఎం జగన్ ఉత్తరాంధ్ర నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతుండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో కూడా విజయం మనదేనని, మరింత ఉత్సాహంతో పార్టీ శ్రేణులు ఈ సమావేశంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇందుకూరి రఘురాం, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ, సాయిరాజ్, బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, శాసన సభ్యులు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్ కుమార్, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ, శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, డీపీ దేవ్, రాజాపు హైమావతి అప్పన్న, సుడా చైర్మన్ కోరాడ ఆశాలత గుప్త, డాక్టర్ చింతాడ వరుణ్ యువనేతలు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, తమ్మినేని చిరంజీవినాగ్, ఎంవీ స్వరూప్, తలే రాజేష్, డోల జగన్, కోణార్క్ శ్రీను, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు పాల్గొన్నారు.



సిద్ధం పోస్టర్‌ను రిలీజ్ చేస్తున్న పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, విజయనగరం ఎంపీ బెల్లాన, పార్టీ నాయకుడు పేరాడ తిలక్ తదితరులు



హాజరైన పార్టీముఖ్య నాయకులు, కార్యకర్తలు

పాత ముఖాలు కొత్త కండువాలు



- ఎన్నికల ముందు టీడీపీ చేరికల డ్రామాలు
- సొంత నాయకులు, కార్యకర్తలకు కండువాలు వేసి కొత్తగా పార్టీలో చేరినట్లు ప్రచారం
- ఉత్తుత్తి చేరికలతో ప్రజల్లో అభాసుపాలు
- ఇచ్ఛాపురం, టెక్కలి, ఎచ్చెర్ల, పాతపట్నం, పలాస, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో ఫేక్ చేరికలు
- నవ్వుతున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : అలవోకగా అబద్ధాలు చెప్పడం.. వాటిని ఉద్ధృతంగా ప్రచారంలోకి తీసుకురావడం.. అవాస్తవాలను నిజాలుగా నమ్మించి లబ్ధి పొందడం.. చంద్రబాబు చాలాకాలంగా నమ్మిన సూత్రమిది. ఇప్పటి టీడీపీ పునాదులు కూడా ఈ మాటల మీదనే ఆధారపడి ఉన్నాయి. తాజాగా ఎన్నికల నేపథ్యంలో ఆ పార్టీ నాయకుల వ్యవహార శైలి ఇదే విషయాన్ని మళ్లీ రుజువు చేస్తోంది. ఇప్పటికే వారు ప్రభుత్వ కార్యక్రమాలపై అసత్యపు ప్రచారాలు చేసి అభాసుపాలయ్యారు. సెల్ఫీ ఛాలెంజ్‌లు వేసి పరువు పోగొట్టుకున్నారు. ఇప్పుడేమో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులకే మళ్లీ కండువాలు వేసి పార్టీలో చేరినట్టు ప్రచారం చేసుకుంటున్నారు. ఇందులో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు సిద్ధహస్తుడిగా మారిపోయారు. ఫేక్ చేరికలను నమ్ముకుని రాజకీయాలు చేస్తున్నారు. అధినేత వద్ద మెప్పు పొందడం కోసం అడ్డదార్లు తొక్కుతున్నారు. ఆయన పంథాలోనే అచ్చెన్నాయుడు, కూన రవికుమార్ వెళ్లి జనాల్లో అభాసుపాలవుతున్నారు. సొంత నాయకులకు మళ్లీ కండువాలు వేసి టీడీపీలో చేరినట్టు చూపించడాన్ని సొంత పార్టీ నాయకులే ఆక్షేపిస్తున్నారు. ఏకంగా చంద్రబాబు చేత కూడా టీడీపీలో కొనసాగిన వ్యక్తులకు కొత్తగా కండువాలు వేయించడం మరింత విచిత్రమని శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ నాయకులు విస్తుపోయారు.

శ్రీకాకుళంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడితో రెడ్డి చిరంజీవి సాన్నిహిత్యం గురించి ఇక్కడ అందరికీ తెలుసు. ఆయన మొదటి నుంచీ టీడీపీలోనే ఉన్నారు. ఇప్పుడు అదే చిరంజీవి కొత్తగా టీడీపీలో చేరినట్టు ఏకంగా పార్టీ అధినేత చంద్రబాబు చేత కండువా వేయించారు. ఎంపీతో చిరంజీవికి ఉన్న భూ లావాదేవీలు కథలుకథలుగా చెబుతారు. అలాంటిది ఆయనకు అధినేతతో కండువా వేయించడమేంటని సొంత పార్టీ నాయకులే ముక్కున వేలేసుకుంటున్నారు.

ఆశి చిరంజీవులు..టీడీపీ హయాంలో రెండుసార్లు ఏఎంసీ చైర్మన్‌గా పనిచేశారు. ఆయనతో పాటు ఆయన సోదరులు సీతారాం, శ్రీధర్ రెడ్డిలకు కూడా ఎంపీ రామ్మోహన్‌నాయుడు మళ్లీ కండువా వేసి పార్టీలో చేరినట్లు ప్రచారం చేశారు. మాజీ ఆర్మీ ఉద్యోగి రమణారెడ్డి కూడా టీడీపీలోనే ఉంటున్నారు. ఆయనకు కూడా కండువా వేసేశారు.

ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం నియోజకవర్గాల్లో ఇప్పటికే ఇలాంటి ప్రయోగాలెన్నో చేసి ప్రజల్లో చులకనైపోయారు. కళా వెంకటరావు తీరును సొంత పార్టీ నాయకులు నేరుగా సోషల్ మీడియాలో ఏకిపారేశారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడైతే గత కొంతకాలంగా ఫేక్ చేరికలపైనే దృష్టి పెట్టారు. కీర్తిపురం, మండపల్లి తదితర గ్రామాల్లోనే ఇదే రకంగా చేసి ఆ గ్రామాల్లో అభాసుపాలయ్యారు. మరికొన్ని గ్రామాల్లో ఇదేరకమైన డ్రామాలాడేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీరి తీరును చూసి ప్రజలు సైతం నవ్విపోతున్నారు. టీడీపీలోకి తరలొచ్చేస్తున్నట్టు.. ఏదో జరిగిపోతున్నట్టు ప్రజల్లో తప్పుడు సంకేతాలిచ్చేందుకు టీడీపీ నాయకులు అడ్డదారులు తొక్కుతున్నారు. తప్పుడు ప్రచారంతో ఫేక్ వేవ్‌లు సృష్టిస్తున్నారు. ఎవరేంటో, ఎవరు ఏ పార్టీ వాళ్లో తెలిసిన స్థానికులు టీడీపీ తీరును దుయ్యబడుతున్నారు.

టెక్కలి నియోజకవర్గంలో ఇటీవల తంగుడు విష్ణుమూర్తి, జామి నర్సింహమూర్తి, గండి సూర్యనారాయణ, ఉపేంద్రరావు, నూక కనకరావు తదితరులు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరినట్టు బిల్డప్ ఇచ్చారు. వీరంతా వ్యాపారులే. గత ఎన్నికల్లో అచ్చెన్నాయుడు కోసం భారీగా డబ్బులు ఖర్చు పెట్టారు. వాళ్లకే మళ్లీ కండువాలు వేయడం చూసి ఆ పార్టీ నాయకులే ఆశ్చర్యపోయారు.

బూర్జ మండలంలోని డొంకలపర్త, బూర్జ గ్రామాల్లో బెజ్జిపురపు స్వామినాయుడు, జడ్డు చిన్నంనాయుడు, జడ్డు కృష్ణ, కుప్పిలి బాలరాజు, కుర్రం గురువులు, మడపాన గన్నిరాజు, సిర్లా ప్రకాష్, సందడి చాకలి, అల్లు పోలి, వైశ్యరాజు భీమరాజు, బైరి లక్ష్మినారాయణ, వడ్డాది భోగిరాజులు టీడీపీలో క్రియాశీలకంగా ఉంటారు. అయినా కూన రవికుమార్ వారిని ఇప్పుడు కొత్తగా పార్టీలోకి ఆహ్వానించినట్లు ప్రచారం చేశారు.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

శ్రీకాకుళం న్యూకాలనీ: రిపబ్లిక్ డే వేడుకలకు సర్వం సిద్ధమైంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల మైదానం వేదికగా శుక్రవారం జరిగే ఈ వేడుకలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. షామినానా, స్టాళ్లు, శకటాలను సిద్ధం చేశారు. ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఏర్పాట్లను గురువారం సాయంత్రం జేసీ ఎం.నవీన్ పరిశీలించారు. వేదిక, ప్రదర్శన స్టాళ్లు, సిట్టింగ్, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ వేడుకలు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆధ్వర్యంలో జరగనున్నాయి. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యే ఈ కార్యక్రమంలో ఉదయం 9 గంటలకు కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.



కళాశాలలో ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న జేసీ నవీన్, పక్కనే సహాయ కలెక్టర్, తదితరులు

ఆర్టీసీకి కాసుల వర్షం

- సంక్రాంతికి నాలుగు డిపోల ఆదాయం రూ. 1.21 కోట్లు
- జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్



ఎ.విజయ్‌కుమార్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ఏపీఎస్‌ఆర్టీసీకి సంక్రాంతి కాసుల వర్షం కురిపించింది. జిల్లాలో ఉన్న పలాస, టెక్కలి, శ్రీకాకుళం-1, శ్రీకాకుళం-2 డిపోలచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపడం ద్వారా రికార్డు స్థాయిలో రూ. 1,21,20,975 ఆదాయాన్ని సమకూర్చుకుందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ గురువారం అన్నారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 22 వరకు 624 ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామని, పండగ ముందు, తర్వాత సాధారణ చార్జీలకే మంచి కండిషన్‌తో ఉండే బస్సులు నడపడంతో ప్రయాణికులు అధికమొత్తంలో మొగ్గు చూపడంతో ఈ రికార్డు ఆదాయం సాధ్యపడిందని అన్నారు. ముఖ్యంగా డిపోల మేనేజర్లు పి.బి.మల్లికార్జునరావు, కె.ఎస్.ఆర్.శర్మ పండగ రోజుల్లో ఉండే రద్దీ సమయాల్లో సమన్వయంతో పనిచేసి సిబ్బందికి అలెర్ట్ చేయడం వల్ల ప్రయాణికులకు సమయానికల్లా బస్సులందేలా చేశారన్నారు. ప్రైవేట్ ట్రావెల్స్‌కు ఈసారి అడ్డుకట్ట వేశామన్నారు.



ఏపీఎస్ ఆర్టీసీ కాంప్లెక్సు

డిపో	బస్సులు	ఆదాయం (రూ.లలో)
శ్రీకాకుళం–1	179	35,55,908
శ్రీకాకుళం–2	169	30,63,082
టెక్కలి	119	25,20,806
పలాస	157	29,81,179
మొత్తం	624	1,21,20,975

ఆడపడుచుల సంబరాలు



ఎచ్చెర్ల: లావేరు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఆసరా సంబరాలకు హాజరైన మహిళలు

అవసరానికి చేతికి అందిన డబ్బు విలువెంతో 'ఆసరా' లబ్ధిదారులను అడిగితే తెలుస్తుంది. ఈ డబ్బు ఒకరి ఇంటిలో కన్నీరు తుడిచింది, మరో ఇంటిలో దీపం వెలిగించింది, ఇంకొక ఇంటిలో ఇల్లాలికి ధైర్యాన్నిచ్చింది. అందుకే ఆసరా సంబరాలు జిల్లాలో ఉద్వేగంగా జరుగుతున్నాయి. పొందిన మేలును గుర్తుంచుకుని ఆడపడుచులు అభిమాన నాయకుడికి మనసారా కృతజ్ఞతలు చెబుతున్నారు.

ఇచ్చిన మాట ప్రకారం..



ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల్లో సీఎం వైఎస్ జగన్ రుణమాఫీ చేశారు. ఈ రుణమాఫీ సొమ్ముతో ఆర్థిక అవసరాలు తీర్చుకున్నాం. మహిళల సంక్షేమానికి జగన్ అనేక రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. ఆసరాతో ఏడాదికి రూ.16,670, మొత్తం రూ.66,680లు లబ్ధి పొందాను. జీరో వడ్డీ కింద నాకు రూ.3,456లు వచ్చాయి. – బెవర శ్రీదేవి, జై సంతోషిమాత స్వయంశక్తి సంఘం, కొరసవాద, పాతపట్నం

మహిళల కన్నీరు తుడిచాం

మహిళల కన్నీరు తుడిచిన ప్రభుత్వమిది. స్త్రీని శక్తివంతురాలిగా చేసింది. కుటుంబానికి ఇల్లాలినే యజమానిగా చూపించి ఆమెకు ఆర్థిక భరోసా అందజేసింది. ఇది వైఎస్సార్ సీపీ సాధించిన విజయం. – ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ మంత్రి

(శ్రీకాకుళం, గారలో నిర్వహించిన ఆసరా సంబరాలు కార్యక్రమాల్లో..)





శ్రీకాకుళంలో నిర్వహించిన సంబరాలకు హాజరైన జనం, చెక్కు అందిస్తున్న మంత్రి ధర్మాన

వ్యాపారానికి ఆసరా తోడైంది..



నా పేరు ఇప్పిలి స్వాతి. తూలుగు పంచాయతీలో దుర్గాదేవి గ్రూపులో సభ్యురాలిగా ఉన్నాను. నాకు వైఎస్సార్ ఆసరా పథకంలో రుణమాఫీ వచ్చింది. ఇప్పటికే మూడు విడతలుగా డబ్బులు అందాయి. దీంతో మా పంచాయతీ పరిధిలో తూలుగు జంక్షన్‌లో విజయ దుర్గా సైకిల్ షాపు పేరిట సైకిల్‌కి సంబంధించి స్పేర్ పార్ట్స్ దుకాణం పెట్టాను. ఆ తర్వాత బ్యాంకు రుణం తీసుకొని బైక్‌ల విడిభాగాల విక్రయం కూడా మొదలుపెట్టాం. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. నా భర్త తెచ్చిన ఆదాయానికి నా దుకాణం ఆదాయం కూడా తోడై ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కాం. – ఇప్పిలి స్వాతి, తూలుగు, గార మండలం, శ్రీకాకుళం జిల్లా



జలుమూరు: చల్లవానిపేట సంబరాలకు హాజరైన జనం, చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

మీరే మా బలం

వైఎస్సార్ సీపీకి మహిళలే బలం. మహిళల ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. అందుకే అన్ని పథకాలు ఆమెకే అందజేస్తున్నారు. మహిళలను అందలం ఎక్కించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే. – ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

(చల్లవానిపేటలో నిర్వహించిన ఆసరా సంబరంలో..)



క్లుప్తంగా

సీఐల బదిలీలు



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు శాఖకు సంబంధించిన ఇన్‌స్పెక్టర్లను స్థానచలనం చేస్తున్నట్లు విశాఖపట్నం రేంజి కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం డీఎస్‌బీ సీఐగా ఉన్న గింగ్రి దాలిబాబు విశాఖపట్నం సిటీకి, ఆమదాలవలస సీఐ పి.పైడయ్య టెక్కలి అర్బన్ పీఎస్‌కు, విశాఖపట్నం రేంజి వీఆర్‌లో ఉన్న జి.దివాకర్ వాయునందన్ ఆమదాలవలస సీఐగా బదిలీ అయ్యారు.

ఎస్‌ఐలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖపట్నం రేంజి కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు ఎస్‌ఐలకు స్థానచలనం చేస్తున్నట్లు జిల్లా సూపరింటెండ్ ఆఫ్ పోలీసు కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదలైంది. ఈ మేరకు ఆమదాలవలస ఎస్‌ఐ వై.కృష్ణ, నరసన్నపేట ఎస్‌ఐ సింహాచలంలు విశాఖపట్నం సిటీకి, విశాఖ సిటీ (ద్వారక క్రైమ్, న్యూపోర్టు క్రైమ్) నుంచి సరుబుజ్జిలి, బూర్జ పీఎస్‌లకు బి.నిహార్, జి.ప్రసాద్‌లు బదిలీపై రానున్నారు.

యశోదమ్మ నేత్రాలు సజీవం



యశోదమ్మ

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళానికి చెందిన ప్రముఖ వైద్యులు గండి విద్యాసాగర్ మాతృమూర్తి గండి యశోదమ్మ (80)గురువారం మృతి చెందారు. ఆమె కుమారుడు విద్యాసాగర్ తల్లి మరణానంతరం కూడా మరో ఇద్దరికి చూపు ఇవ్వాలని ఆలోచనతో ఆమె రెండు కళ్లను దానం ఇవ్వాలని నిర్ణయించుకుని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం ద్వారా ఆమె కార్నియాలు సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్రసేకరణ కేంద్రానికి అందించారు. నేత్రదానం చేసిన దాత కుటుంబ సభ్యులను చైర్మన్ అభినందించారు. ఎవరైనా నేత్రదానం చేయాలనుకునే వాళ్లు 7842699321 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.


కవాతు రిహార్సల్స్ పరిశీలన

శ్రీకాకుళం క్రైమ్ : గణతంత్ర దినోత్సవం నాడు ప్రదర్శించనున్న పోలీసుల కవాతు రిహార్సల్స్‌ను నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం వద్ద గురువారం ఎస్పీ జీఆర్ రాధిక పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా ఎస్పీ జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. అనంతరం పరేడ్ కమాండర్ ఎస్పీకి గౌరవవందనం చేశారు. రిహార్సల్స్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీస్ బ్యాండ్ ప్రదర్శన బాగుందని, చిన్న మార్పులు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు వై.శృతి, కేఎస్ వాసన్, రెండో పట్టణ సీఐ పప్పల శ్రీనివాసరావు, ఆర్‌ఐలు సురేష్, ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బెస్ట్ బీఎల్‌ఓగా కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలో ఉత్తమ బూత్ లెవల్ ఆఫీసర్‌గా బుగడుట్లపాలేం వెల్ఫేర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు విజయవాడలో గురువారం ఓటర్ల దినోత్సవం సందర్భంగా గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతులమీదుగా అవార్డు స్వీకరించారు. తాను అధికారిగా వ్యవహరించిన బూత్‌లో వంద శాతం పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించారు. డెత్‌ల తొలగింపు, అర్హులను నూతన ఓటర్లుగా చేర్పు, ఆధార్ సీడింగ్, డబుల్ ఎంట్రీ తొలగింపు వంటి చర్యలు తీసుకున్నారు. కిరణ్‌కుమార్‌ను నియోజకవర్గ ఆర్వో పద్మావతి, తహసీల్దార్ టి.సత్యనారాయణ ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయ బేస్‌బాల్ పోటీలకు నలుగురు ఎంపిక



జాతీయ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డీఈఓ, పీడీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్కూల్‌గేమ్స్ అండర్-14 బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైనవారిలో జెడ్పీహెచ్ స్కూల్ ఇప్పిలికి చెందిన బి.రాజేష్, జి.వెన్నెల, కె.దేవి, జెడ్పీహెచ్‌స్కూల్ లావేరుకు చెందిన ఎ.అనిల్‌కుమార్ ఉన్నారు. ఈ పోటీలు ఈనెల 28 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు రాయ్‌పూర్‌లో జరగనున్నాయి. వీరు నలుగురు ఎస్‌జీఎఫ్ ఆంధ్రప్రదేశ్ బాల బాలికల జట్టు తరపున జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. కాగా ఎంపికైన క్రీడాకారులను జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు గురువారం సాయంత్రం తన చాంబర్‌లో అభినందించారు. జాతీయ పోటీల్లో క్రమశిక్షణగా పట్టుదలతో ఆడి, విజయబావుటా ఎగుర వేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘ జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, పీఈటీ సంఘ ఉపాధ్యక్షుడు మెట్ట తిరుపతిరావు, బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.రవికుమార్, గౌరి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగమే దేశ సేవ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

- యువత వృద్ధులను ఆదర్శంగా తీసుకోవాలి
- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్
- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



సీనియర్ సిటిజన్‌లను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటు హక్కును వినియోగించుకోవడమే అసలైన దేశ సేవ అని, యువత వృద్ధులను ఆదర్శంగా తీసుకుని ఓటేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బి.లాఠకర్ పేర్కొన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం స్థానిక బాపూజీ కళామందిర్‌లో గురువారం జరిగింది. కార్యక్రమానికి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో నూతన ఓటర్లు పాల్గొన్నారు. ముందుగా అందరూ సూర్యమహల్ జంక్షన్ నుంచి ర్యాలీ చేశారు. ఏడు రోడ్ల కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం బాపూజీ కళామందిర్‌లో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఓటు ప్రాముఖ్యత తెలియాలన్నారు. ప్రతి పౌరుడు ఓటర్‌గా నమోదవ్వడంతో పాటు మన చుట్టు పక్కల వారు ఓటర్‌గా నమోదయ్యారో లేదో గ్రహించాలన్నారు. ప్రతి రోజు ఓటరుగా నమోదు చేసుకొనే అవకాశం ఉందని అన్నారు. జిల్లాలో 2357 పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం పోలింగ్ కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తే 65, 70 శాతం మందే తమ హక్కు వినియోగించుకుంటే మిగిలిన ఏర్పాట్లు వృధాగా మిగిలిపోతాయని చెప్పారు. జాయింట్ కలెక్టర్, స్వీప్ నోడల్ అధికారి ఎం.నవీన్ మాట్లాడుతూ 14వ జాతీయ ఓటర్ల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జీవితంలో ఒక వ్యక్తి 10 నుంచి 12 సార్లు మాత్రమే ఓటు వేసేందుకు అవకాశం ఉంటుందని, వివిధ దేశాల్లో అందరికీ ఓటు హక్కు ఉండేది కాదన్నారు. ఓటు హక్కు కోసం చాలా మంది కృషి చేశారన్నారు. ప్రతి ఒక్కరూ దేశ అభివృద్ధి కోసం విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

రెవెన్యూ డివిజనల్ అధికారి, శ్రీకాకుళం నియోజకవర్గం ఎన్నికల అధికారి సీహెచ్ రంగయ్య మాట్లాడుతూ చనిపోయిన ఓటర్లను తొలగించడం, 18 ఏళ్లు నిండిన వారికి నమోదు చేసి ఓటు హక్కు కల్పించడం వంటి కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం బాపూజీ కళామందిర్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఓటు నమోదు కేంద్రాన్ని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సందర్శించారు.

కార్యక్రమంలో నూతనంగా ఓటు హక్కు కలిగిన యువతీ, యువకులకు ఓటరు కార్డులు అందజేశారు. ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరితో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కాకినాడ ఆదిత్యా డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఎల్.శ్రావణి, సన్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న బి.తులసి మాట్లాడుతూ ఓటు ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, కె.వి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ రీసెర్చ్ కేంద్రం దేశానికే దిక్సూచి

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



హరిపురంలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: ఉద్దాన ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ వ్యాధికి శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయగలిగామని రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని బాలిగాం, హరిపురం, అంబుగాంలలో గురువారం జరిగిన సమావేశాల్లో మాట్లాడుతూ కిడ్నీవ్యాధితో వందల మంది ఉద్దానం వాసులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఉద్దానం ప్రాంతం కన్నీటి కష్టాలను కళ్లారా చూశారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కిడ్నీవ్యాధి బాధితులను ఆదుకున్నారని తెలిపారు. వైద్య సదుపాయం, పింఛన్ల పెంపు, డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు, కేంద్రాలకు రాకపోకలకు సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పలాసలోనే ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. ఈ కేంద్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. 'మేము హామీ ఇచ్చాం.. సమస్యలపై మాట్లాడాం.. మా హయాంలోనే శ్రీకారం చుట్టాం' అని చెబుతున్న టీడీపీ నాయకులు వాటికి సార్థకత చేయలేక కుంటిసాకులు చెబుతున్నారని ధ్వజమెత్తారు. చిత్తశుద్ధితో ప్రజలకు సేవ చేయలేక వారు అబద్ధాలు చెబుతున్నారన్నారు. టీడీపీకి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు 50 రోజులు మాత్రమే సమయం ఉందని, కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను మంత్రి సీదిరి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, రిటైర్డ్ డీఎస్పీ శమళ్ల ప్రసాదరావు, వైస్ ఎంపీపీలు సీర ప్రసాద్ కొర్నాని ఆదినారాయణ, సర్పంచ్ తలగాన చంద్రశేఖర్, జగన్నాథపురం పురుషోత్తం, తిరునగిరి వెంకాయమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, జిల్లా కార్యదర్శి బల్ల లీలాకుమారి, ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, మహిళా మట్ట ఖగేశ్వరరావు, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సాంద్ర ఢిల్లేశ్వరరావు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ అందాల శేషగిరి, రిటైర్డ్ హెచ్‌ఎం వల్లభ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కారులో ఏడు కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో నిందితుల్ని పట్టుకున్న ఎస్‌ఐ అనిల్‌కుమార్

మందస: ఒడిశా నుంచి కేరళ వైపు వెళ్తున్న కారులో మందస పోలీసులు ఏడు కిలోల 900 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన వ్యక్తి నుంచి కొనుగోలు చేసిన గంజాయిని కేరళకు చెందిన ఇద్దరు వ్యక్తులు తీసుకెళ్తుండగా.. మందస మండలంలోని కొత్తపల్లి జాతీయ రహదారిపై పోలీసులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మందస ఎస్‌ఐ ఎ.అనిల్‌కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. కేరళకు చెందిన బినేష్ బాలకృష్ణ అనే 24 ఏళ్ల యువకుడు కేరళ నుంచి ఒడిశా రాష్ట్రంలో బరంపురానికి ఇటీవల వచ్చాడు. స్టేడియం ప్రాంతంలో గోలీ సోడాలు అమ్ముతున్న బుల్లు మజ్జి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. గంజాయి తన వద్ద ఉందని బల్లు చెప్పి, శాంపిల్ చూపించడంతో రుచి మరిగిన బినేష్ బాలకృష్ణ ఆయన స్నేహితుడైన అజ్మల్‌కు విషయాన్ని చెప్పాడు. దీంతో వీరిద్దరు బరంపురం చేరుకుని, గంజాయి కావాలని ముందే సమాచారం ఇవ్వడంతో పుల్బాణి నుంచి తెప్పించిన బుల్లు వీరిద్దరికీ అందించాడు. కారులో ముగ్గురూ బరంపురం నుంచి వస్తుండగా.. కొత్తపల్లి జాతీయ రహదారిపై పోలీసులకు పట్టుబడ్డారు. తనిఖీల్లో భాగంగా కారును పరిశీలించగా, అసలు బండారం బయటపడింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని, ఈ ముగ్గురిని అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించినట్టు ఎస్‌ఐ అనిల్‌కుమార్ చెప్పారు. ఈ దాడుల్లో ఎస్‌ఐతో పాటు ఏఎస్‌ఐ కె.శేఖరావు, హెచ్‌సీ వై.గవరయ్య, పీసీలు ఎస్.రవికుమార్, టి.నేతాజీ, పంచాయతీ కార్యదర్శి రోళ్ల సింహాద్రి, వీఆర్వో ఇప్పిలి భవానీ ఉన్నారు.

ల్యాప్‌టాప్‌ల దొంగల ముఠా అరెస్ట్

తాటిచెట్లపాలెం: రైళ్లు, రైల్వేస్టేషన్లలో మొబైల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను దొంగలించే ముఠాను గురువారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలివీ.. విశ్వసనీయ సమాచారం మేరకు.. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావు ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ బి.అప్పలనాయుడు సిబ్బందితో రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన అజయ్‌కుమార్ (23), చిన్న అప్పలనాయుడు (20), రాహుల్(19)లను విచారించి.. రైళ్లలో దొంగతనాలకు పాల్పడే ముఠాగా గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని.. వారి వద్ద ఆరు ల్యాప్‌టాప్‌లు, నాలుగు మొబైల్ ఫోన్లు, ఐప్యాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

బొరిగివలసలో చోరీ



ఇంట్లో తెరిచి ఉన్న బీరువా

నరసన్నపేట: మండలంలోని పెద్దబొరిగివలసలో యడ్ల రమేష్ అనే రైతు ఇంటిలో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు విరగ్గొట్టి లోపలికి ప్రవేశించి బీరువా తెరిచి బంగారం, వెండి ఆభరణాలతో పాటు రూ. 68 వేలు నగదును చోరీ చేశారు. పట్టపగలే ఈ చోరీ జరగడంతో పోలీసులు, గ్రామస్తులు నివ్వెర పోతున్నారు. తమ గ్రామంలో ఇప్పటి వరకూ ఇటువంటి చోరీలు జరగలేదని గ్రామస్తులు బగ్గు రమణయ్య, రాజాపు అప్పన్నలు తెలిపారు. రైతు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఐదున్నర తులాల బంగారు ఆభరణాలు, నాలుగు తులాల వెండి వస్తువులతో పాటు రూ. 68 వేలు నగదు చోరీకి గురైంది. ఉదయం రమేష్‌తో పాటు భార్య నిర్మల పొలం పనులకు వెళ్లారు. పిల్లలు స్కూల్‌కు వెళ్లిపోయారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నిర్మల పొలం నుంచి ఇంటికి వచ్చే సరికి ఇంటి ప్రధాన ద్వారం గెడ తీసి ఉంది. వేసిన తాళం విరగ్గొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూస్తే బీరువా తెరిచి ఉండడంతో వెంటనే చుట్టుపక్కల వారికి సమాచారం అందజేశారు. వెంటనే ఇరుగు పొరుగు వారు వచ్చి పరిశీలించి దొంగలు పడి వస్తువులు తీసుకుపోయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పండిన ధాన్యం డబ్బులు రావడంతో బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు రెండు రోజుల కితమే విడిపించామని, ఇంతలో దొంగతనం జరిగి ఇళ్లు గుల్ల అయ్యిందని నిర్మల కంట నీరు పెట్టుకున్నారు. పోలీసులు తగిన చర్యలు తీసుకొని చోరీకి గురైన ఆభరణాలు గుర్తించి అప్పగించాలని కోరుతున్నారు. కాగా బీరువాలో రెండు తులాల జడగంటలు ఉన్నా అవి రోల్డ్‌గోల్డుగా భావించిన దొంగలు వాటిని తీసుకువెళ్లలేదు. చోరీ సమాచారం తెలుసుకున్న సీఐ బి.ప్రసాదరావు, ఎస్‌ఐ సింహాచలంలు ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి వేలి ముద్రలు సేకరించారు. దొంగతనానికి పాల్పడింది స్థానికులుగానే పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా దొంగతనానికి గురైన ఇళ్లు నివాసాలకు దూరంగా ఉండటంతో గ్రామస్తులు ఎవరూ గుర్తించలేక పోయారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



రాయగడ: జిల్లాలోని గుణుపూర్ రైల్వేస్టేషన్‌లో ఒక యువకుడు రైల్వే విద్యుత్ తీగను పట్టుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలకు గురైన అతడిని రైల్వే పోలీసులు సబ్ డివిజనల్ ఆస్పత్రికి తరలించారు. బుధవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కొత్తూరు ప్రాంతానికి చెందిన జి.సాయికృష్ణ (34) అనే వ్యక్తి గుణుపూర్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు విశ్రాంతి తీసుకునే ప్రాంతంలో కూర్చున్నాడు. అదే సమయంలో పూరి నుంచి గుణుపూర్ వెళ్లే రైలు రాత్రి 9.30 గంటలకు స్టేషన్ చేరుకుంది. ట్రైన్ ఆగిన వెంటనే సాయి కృష్ణ ట్రైన్‌పైకి ఎక్కి అక్కడ ఉండే విద్యుత్ తీగను తాకాడు. దీంతో అతని శరీరం కాలిపోయింది. వెంటనే తోటి ప్రయాణికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. రంగప్రవేశం చేసిన సిబ్బంది అతడిని రక్షించి వెంటనే చికిత్స కోసం గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే 80 శాతం వరకు గాయాలైన అతడిని మెరుగైన చికిత్స కోసం బరంపురం తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణం తెలియరాలేదు. పోలీసులు బంధువులకు సమాచారం అందించారు.

సాయి ఉత్సవాలకు సర్వం సిద్ధం



46అడుగుల నాగసాయి విగ్రహం వద్ద భక్తులు

జి.సిగడాం : ఆనందపురం గ్రామంలో షిర్డీ సాయి బాబా, 100 అడుగుల ఎత్తుగల వెంకట సాయికోటి మహాస్థూపం 22 వ వార్షికోత్సవానికి సర్వం సిద్ధమైంది. శుక్రవారం ఉదయం 4 గంటల నుంచి సాయి కోటి నామాల పుస్తకాలను వేసేందుకు సుమారుగా లక్షా 50 వేల మంది బాబా భక్తులు హాజరు కానున్నారు. ఈనెల 19నుంచి ఆనందపురం గ్రామంలో వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి.

65 మందిపై కేసు నమోదు

హిరమండలం: మండలంలోని ఎం.అవలంగి పంచాయతీ బొమ్మిగూడ గ్రామంలో జరిగిన భూ వివాదంలో ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు స్వీకరించి 65 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి.నారాయణ స్వామి తెలిపారు. గురువారం ఎం.అవలంగి గ్రామానికి చెందిన పి.రఘు బొమ్మిక గ్రామంలోని పొలాన్ని చదును చేస్తుండగా.. బొమ్మిక గ్రామానికి చెందిన ఎస్.ప్రసాద్‌తోపాటు పలువురు గిరిజనులు ఆ భూమి తమదంటూ అడ్డుకున్నారు. దీంతో వాదోపవాదాలు జరిగి ఘర్షణకు దిగారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇరు వర్గాలకు చెందినవారు ఫిర్యాదులు చేసుకున్నారు. ఎస్.ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుతో 40మందిపైన, పి.రఘు ఇచ్చిన ఫిర్యాదుతో 25మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి: వీసీ



సన్‌రైజ్ ఇంక్యుబేషన్ సంస్థ ఒప్పంద పత్రాలు ప్రదర్శిస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని తెలిపారు. వర్సిటీలో గురువారం ఐటీ, కమ్యూనికేషన్ శిక్షణ సంస్థ సన్‌రైజ్‌తో (ఎంఓయూ) ఒప్పందం కుదుర్చుకున్నారు. సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ ఇంక్యుబేషన్ సొసైటీ కార్యనిర్వాహణ అధికారి టి.అనిల్ కుమార్‌తో ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ప్రతి విద్యార్థికి స్కిల్ ఆధారిత శిక్షణ అందించి పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

పరీక్ష విభాగం బలోపేతం కావాలి..

వర్సిటీలో పరీక్షల విభాగం బలోపేతం కావాలని, పరీక్షల నిర్వాహణతో పాటు సకాలంలో ఫలితాలు విడుదల కావాలని వీసీ రజిని స్పష్టం చేశారు. వర్సిటీ పాలక మండలి సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఎగ్జామినేషన్ సెక్షన్‌కు తగ్గ సామర్థ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టనున్నట్లు చెప్పారు.

రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

కొంతకాలంగా జాప్య మవుతున్న రీవాల్యుయేషన్ ఫలితాలను వీసీ రజిని గురువారం విడుదల చేశారు. బీటెక్ ఆరో సెమిస్టర్, డిగ్రీ రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్, పీజీ, వృత్తి విద్యా కోర్సుల 2, 4 సెమిస్టర్ ఫలితాలు విడుదల చేశారు. మార్కుల జాబితాలు విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు. విద్యార్థులకు సంబంధించిన పనులు జాప్యానికి అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, కాన్ఫిడెన్షియల్ డీన్ డాక్టర్ ఎం.అనురాధ పాల్గొన్నారు.

ఆ ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

అరసవల్లి: వైద్యశాఖలో పలు ఉద్యోగాల నియామకాల్లో అక్రమాలు, తప్పుడు ఫిర్యాదుల వ్యవహారం జిల్లా వైద్యారోగ్య శాఖలో సంచలనంగా మారిన సంగతి విదితమే. దీనిపై 'సాక్షి'లో మంగళవారం ప్రచురించిన 'వైద్యారోగ్య శాఖలో రచ్చరచ్చ' పేరిట ప్రచురించిన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. ఈమేరకు ఆ ఉద్యోగులపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ కొరఢా ఝుళిపించారు. కీలక ఉద్యోగులైన జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ డి.భాస్కర్‌కుమార్‌తో పాటు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సీనియర్ అసిస్టెంట్ ఐవీ శ్రీనివాస ఆచారిలను విధుల నుంచి సస్పెన్షన్‌కు రికమెండ్ చేస్తూ గురువారం ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఈ వ్యవహారాలపై శాఖాపరంగా విచారణ వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో గురువారం వైద్యశాఖలో సంచలనంగా మారింది.

కలెక్టర్ ఆదేశాల రిపోర్టును ఆర్‌డీకి పంపించాం

ఈ వ్యవహారంపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి వద్ద 'సాక్షి' ప్రస్తావించగా.. వైద్యారోగ్య శాఖలో తాజాగా వెలుగులోకి వచ్చిన వ్యవహారంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయ సూపరింటెండెంట్ డి.భాస్కర్‌కుమార్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆచారిలను విధుల నుంచి సస్పెన్షన్‌కు రికమెండ్ చేస్తూ రీజనల్ డైరెక్టర్‌కు పంపించాలని కలెక్టర్ గురువారం ఆదేశించారని తెలిపారు. ఈమేరకు వైద్య శాఖ రీజనల్ డైరెక్టర్ కార్యాలయానికి గురువారం సాయంత్రమే రిపోర్టును పంపించామన్నారు.

'నవ భారత సాక్షరత'పై కేంద్ర బృందం క్షేత్ర పర్యటన



వివరాలను సేకరిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

గార:

కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలుచేయనున్న న్యూ ఇండియా లిటరసీ 'నవ భారత సాక్షరత' కార్యక్రమం అమలు, నూతన పుస్తకాల తయారీపై కేంద్రబృందం జిల్లాలో క్షేత్ర పర్యటన జరిపింది. వైఎస్సార్ చేయూత, కాపునేస్తం వంటి పథకాల లబ్ధిదారులైన మహిళలతో సమావేశం నిర్వహించింది. గురువారం రామచంద్రాపురంలో స్థానిక మహిళలు, సచివాలయ సిబ్బందితో న్యూఢిల్లీకి చెందిన సభ్యులు శివశ్రీ వాత్సవ్ హర్షిత, రిచా దిహార్‌లు మాట్లాడారు. వయోజన విద్యలో భాగంగా సమాజంలో వచ్చిన మార్పు, నిరక్షరాస్యులకు, పదో తరగతి వరకు చదువుకున్న వారు, ఇంటర్ వంటి చదువు తర్వాత ఆగిన వారికి అవసరమైన పుస్తకాల తయారీకి సబ్జెక్టు అవసరాలపై మహిళలతో మాట్లాడారు. ఎస్‌సీఈఆర్‌టీకి అవసరమైన పరిజ్ఞానాన్ని అందించేందుకు అన్ని జిల్లాలో పర్యటిస్తున్నామన్నారు. శ్రీకూర్మం పంచాయతీలోనూ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, వయోజన విద్య డీడీ ముద్దాడ వెంకటరమణ, సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, గోరు అనిత, ఏఎస్‌ఓ బాలచందర్, ఏడీ వైకుంఠరావు, యాళ్ల నారాయణమూర్తి, శిమ్మ ధర్మరాజు, సెక్రటరీలు ఎం.రాము, చెట్టు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య



రాకేష్ (ఫైల్)

నరసన్నపేట: స్థానిక బండి వీధిలో నివాసం ఉంటున్న కొట్నీ కళావతి కుమారుడు కొట్నీ రాకేష్ (23) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి పోసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. రాకేష్ నరసన్నపేట బజారు వీధిలోని ఒక బంగారం షాపులో కలెక్షన్ బాయ్‌గా పనిచేస్తుండగా తల్లి కళావతి పెద్దపేటలోని ఒక హోల్‌సేల్ దుకాణంలో పనిచేస్తున్నారు. ఉదయం వరకూ బాగానే ఉన్న రాకేష్ ఉన్నఫలంగా ఇలా ఆత్మహత్యకు ఎందుకు పాల్పడ్డాడో తెలియడం లేదు. బంగారు దుకాణంలో లావాదేవీలే కారణమని తెలుస్తోంది. బంగారం షాపులో నగదు లెక్కల్లో లక్ష రూపాయలు తేడా రావడం రాకేష్‌పై షాపు యజమానులు అనుమానించడంతో మనస్తాపానికి గురై ఈ చర్యకు పాల్పడి ఉంటాడని తల్లి కళావతి అనుమానిస్తున్నారు. పని నుంచి సాయంత్రం ఇంటికి వచ్చిన కళావతి తలుపు తెరిచే సరికి కుమారుడు ఉరికి వేలాడి కనిపించడంతో కన్నీరు మున్నీరుగా విలపించి స్థానికులకు సమాచారం ఇచ్చారు. నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు, ఎస్‌ఐ వై.సింహాచలం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తల్లితో మాట్లాడి వివరాలు సేకరించారు. పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.